మనం
కడప | అన్నమయ్య

# రాజంపేట మున్సిపాలిటీ నందు శాఖపల్లిలో స్కూల్ డెంటల్ క్యాంప్ నిర్వహించిన డాక్టర్ డి నవీన్ కుమార్

రాజంపేట సెప్టెంబర్ 30(మనం న్యూస్)
బుధవారం సత్తుపల్లి లోని స్కూల్ పిల్లలందరికీ దంత పరీక్షల నిర్వహించి ఆ తర్వాత వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చి వారందరికీ ఉచితంగా డెంటల్ కిట్లు అందజేసిన డాక్టర్ డి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి మరియు టీచర్ డేవిడ్ లైన్స్ క్లబ్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య ట్రెజరర్ నాయక్ చాతుపల్లి కన్వీనర్ మహేష్ ఎన్టీఆర్ కేశవ తదితరులు పాల్గొన్నారు



# అభివృద్ధికి 'టెండర్ల' సంకెళ్లు!

**రాజంపేటలో అటకెక్కిన రోడ్లు.. డ్రైనేజీ పనులు**

**పనులు దక్కించుకుని నెలలు గడిచినా ప్రారంభించని కాంట్రాక్టర్లు!**

**రాజకీయ పైరవీలతో పనులు నిలిచిపోతున్నాయన్న ఆరోపణలు**

**టెండర్ల నుంచి పనుల పురోగతి వరకు 'శ్వేతపత్రం' విడుదల చేయాలని డిమాండ్**




మనం ప్రతినిధి, రాజంపేట, సెప్టెంబర్ 30:
రాజంపేట పట్టణ అభివృద్ధికి టెండర్ల ప్రక్రియే అడ్డంకిగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరవుతున్నా.. పనులు మాత్రం క్షేత్రస్థాయిలో ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో గుంతలతో రహదారులు అధ్వానంగా మారగా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## టెండర్లు పూర్తయినా.. పనులు ఎక్కడ?

మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ పనులకు టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లను ఎంపిక చేసినప్పటికీ.. కొన్ని పనులు ఒప్పందాల దశ దాటి ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పనులు దక్కించుకున్న తర్వాత నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంపై స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.
టెండర్ల ప్రక్రియలో కొందరు రాజకీయంగా ప్రభావం కలిగిన కాంట్రాక్టర్లు గుత్తాధిపత్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

## రాజకీయ పైరవీల వలయంలో అభివృద్ధి?

పట్టణంలోని కీలక రోడ్లు, డ్రైనేజీ పనులు ఆలస్యం కావడానికి రాజకీయ జోక్యం, కాంట్రాక్టర్ల మధ్య అంతర్గత వ్యవహారాలు కారణమవుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే ఒప్పంద నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా తగిన చర్యలు కనిపించడం లేదని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

## వర్షం వస్తే రోడ్లే మురుగు కాల్వలు!

రాజంపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. గుంతలు, దెబ్బతిన్న రహదారులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు డ్రైనేజీ కాల్వలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది.

వర్షం కురిసిన సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. దుర్వాసన, దోమల సమస్య కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాంట్రాక్టర్లపై చర్యలు ఎక్కడ?

పనులు దక్కించుకుని నిర్ణీత సమయంలో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై ఒప్పంద నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉంది. గడువు ముగిసిన పనుల వివరాలు, జారీ చేసిన నోటీసులు, పెనాల్టీలు, డిపాజిట్ల పరిస్థితి, ఒప్పందాల రద్దు వంటి అంశాలపై అధికారులు స్పష్టమైన వివరాలు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'శ్వేతపత్రం' విడుదల చేయాలి

రాజంపేట మున్సిపాలిటీలో ఇప్పటివరకు ఎన్ని రోడ్లు, డ్రైనేజీ పనులకు పరిపాలనా అనుమతులు లభించాయి? వాటికి ఎంత నిధులు కేటాయించారు? ఎన్ని పనులకు టెండర్లు పూర్తయ్యాయి? కాంట్రాక్టర్లు ఎవరు? ఒప్పందాల తేదీలు, పనులు పూర్తి చేయాల్సిన గడువు ఎంత? ప్రస్తుతం ఎన్ని పనులు ప్రారంభమయ్యాయి? ఎన్ని పనులు నిలిచిపోయాయి? అనే వివరాలను ప్రజలకు బహిర్గతం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అదేవిధంగా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై తీసుకున్న చర్యలను కూడా మున్సిపల్ అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు.

## రీ-టెండర్లతో పనులు ప్రారంభించాలన్న డిమాండ్

నిర్దేశిత గడువులో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, అవసరమైన చోట్ల రీ-టెండర్లు నిర్వహించి రోడ్లు, డ్రైనేజీ పనులను వేగంగా ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి పనులు రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు బలికాకుండా పారదర్శకంగా సాగాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమం!

పట్టణ సమస్యలపై అధికారులు, పాలకులు తక్షణమే స్పందించకపోతే ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనుల్లో జాప్యానికి కారణాలను బహిర్గతం చేసి, బాధ్యులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాధనం ఖర్చవుతున్నా.. పనులు మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదన్న ప్రశ్నకు మున్సిపల్ యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.




# కరవు నేలలో సిరుల పంట!

**'రైజింగ్ రాయలసీమ'తో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం**

**రూ. లక్ష కోట్ల సమగ్ర ప్రణాళిక.. రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడుల లక్ష్యం**

**సాగునీటి నుంచి ప్రాసెసింగ్, ఎగుమతుల వరకు సమగ్ర వ్యవస్థ**

**అక్టోబర్ 2న మదనపల్లె వేదికగా ప్రారంభం**

మనం ప్రతినిధి – కడప, సెప్టెంబర్ 30:
దశాబ్దాలుగా వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న రాయలసీమలో ఉద్యానరంగానికి కొత్త దిశ చూపించేలా 'రైజింగ్ రాయలసీమ – గ్లోబల్ హార్టికల్చర్ హబ్' బృహత్ ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దార్శనికతతో రూపొందించిన ఈ ప్రణాళికను గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న మదనపల్లె వేదికగా ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. రాయలసీమలో ఉద్యాన పంటల సాగును విస్తరించడంతో పాటు.. రైతులకు మెరుగైన మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్, ఎగుమతి సదుపాయాలను ఒకే వ్యవస్థలో అనుసంధానించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా పేర్కొంటున్నారు. సుమారు లిరూ.లక్ష కోట్ల సమగ్ర ప్రణాళికలో భాగంగా రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులనులి ఆకర్షించే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించినట్లు సమాచారం.

## సీఎం విజన్.. భారీ ప్రణాళిక

నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో సూక్ష్మ సేద్యం, ఉద్యాన పంటల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తూనే.. పండించిన పంటకు మార్కెట్ కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతు పొలం నుంచి వినియోగదారుడి మార్కెట్ వరకు మొత్తం సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'లో కీలక అంశంగా కనిపిస్తోంది.
ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, గ్రేడింగ్–ప్యాకింగ్ కేంద్రాలు, ఆధునిక లాజిస్టిక్స్ వ్యవస్థలు, ఎగుమతి మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో రైతులకు పంట అనంతర నష్టాలను తగ్గించే అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.
మూడు దశల్లో ప్రాజెక్టును అమలు చేసి లిజూలై 2029 నాటికి క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలని లక్ష్యంగాలి పెట్టుకున్నట్లు పేర్కొంది.

## జిల్లా.. పంట.. ప్రత్యేక క్లస్టర్

రాయలసీమలో ఇప్పటికే విస్తృతంగా సాగవుతున్న ఉద్యాన పంటల ఆధారంగా ప్రత్యేక క్లస్టర్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.
అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో జీ–9 అరటి, తీపి బత్తాయి, దానిమ్మ, అంజీర వంటి పంటలకు ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.
వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోలి మదనపల్లె, పులివెందుల, రాజంపేట ప్రాంతాల్లో టమాటా, బొప్పాయి, అరటి, క్యాప్సికమ్ వంటి పంటలకు కోల్డ్‌చెయిన్, నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలను పెంచే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంటున్నారు.
చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోలి తోతాపురి మామిడి పల్ప్ పరిశ్రమలు, పూల మార్కెట్లు, కొబ్బరి ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
కర్నూలు, నంద్యాల జిల్లాల్లోలి బనగానపల్లె మామిడి, ఉల్లి, మిర్చి, దానిమ్మ వంటి పంటలకు ఎగుమతి సదుపాయాలను అనుసంధానించేలా ప్రత్యేక కారిడార్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

## రైతు పంటకు.. మార్కెట్ భరోసా

టమాటా, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు సీజన్‌లో ధరలు పడిపోవడం, నిల్వ సదుపాయాలు లేక పంటను తక్కువ ధరకు విక్రయించాల్సి రావడం రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి. ఈ నేపథ్యంలో స్థానికంగా కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తే పంటను నిల్వ చేసుకునే అవకాశం పెరుగుతుంది.
గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా రాయలసీమ పంటలకు దేశీయ మార్కెట్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలోనూ అవకాశాలు పెంచే లక్ష్యాన్ని ప్రాజెక్టు కలిగి ఉంది. గల్ఫ్, యూరప్ తదితర మార్కెట్లకు ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు వేగవంతమైన రవాణా వ్యవస్థను అనుసంధానించే ప్రతిపాదనలు ఉన్నాయి.

## గ్రామ గ్రామాన ఉద్యాన చైతన్యం

ప్రాజెక్టు ప్రయోజనాలు రైతులకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. రైతు సేవా కేంద్రాలు, ప్రచార రథాలు, బుర్రకథలు, కళాజాతాల ద్వారా అక్టోబర్ 5 వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు.
ప్రారంభ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ఎంపిక చేసిన మహిళా రైతులతో స్థానిక ఉద్యాన పంటలను ప్రదర్శించే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు సమాచారం.

## కరవు చరిత్రకు.. కొత్త మలుపు?

రాయలసీమకు ఉన్న ఉద్యానరంగ సామర్థ్యాన్ని సాగు నుంచి ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల వరకు అనుసంధానించే ప్రయత్నమే 'రైజింగ్ రాయలసీమ -- గ్లోబల్ హార్టికల్చర్ హబ్'గా ప్రభుత్వం వివరిస్తోంది. ప్రణాళికలు ప్రతిపాదించిన విధంగా అమలైతే రైతులకు పంట అనంతర మౌలిక వసతులు, మార్కెట్ అనుసంధానం, ప్రాసెసింగ్ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.
కరవు నేలగా పేరున్న రాయలసీమను ఉద్యాన పంటల ఉత్పత్తి, ప్రాసెసింగ్, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రూపొందించిన ఈ బృహత్ ప్రణాళిక.. రాబోయే రోజుల్లో సీమ వ్యవసాయ రంగంలో ఎలాంటి మార్పులు తీసుకువస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

డిప్యూటీ కమిషనర్ జయరాజు



సిద్ధవటం, సెప్టెంబర్ 30 మనం న్యూస్ : అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఆయన బుధవారం మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలోని సిద్ధవటం ఒంటిమిట్ట, మండలాలకు సంబంధించి 5 మద్యం దుకాణాలు ఖాళీగా ఉన్నందున అక్టోబర్ 1 లోపల దరఖాస్తు చేసుకోవాలని లైసెన్స్ దారులకు అవగాహన నిర్వహించామన్నారు, అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ నారాయణ సిబ్బంది పాల్గొన్నారు

## పెన్నా నదిలో జాలర్లు చేపలు పట్టవద్దు

అడ్డుకున్న రెవిన్యూ సిబ్బంది



సిద్ధవటం, సెప్టెంబర్ 30 మనం న్యూస్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెన్నా నది కి భారీగా జలాశయాలు చేరుకున్నాయి కడప, నగరానికి చెందిన కొంతమంది వ్యక్తులు పెన్నా నదిలో చేపలు పట్టేందుకు రావడంతో రెవిన్యూ సిబ్బంది ప్రమాదాలు అరికట్టేందుకు వారిని మదిలించారు సిద్ధవటం మండలంలోని, లింగంపల్లి పెన్నా నది సమీపాన ఊబి వద్ద కొంతమంది కడప నగరానికి చెందిన వ్యక్తులు చేపలు పట్టేందుకు పెన్నా నదిలోకి దిగడంతో బుధవారం వీఆర్ఏ అడ్డుకున్నారు గజంలో ఇక్కడ ఎంతో మంది మృత్యువాత పడ్డారని అనుభవం లేకుండా పెన్నా నదిలో దిగితే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు పెన్నా నదిలో కొంతమంది ఇసుక తవ్వకాలు జరపడం వల్ల భారీగా గోతులు తీశారని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వీఆర్ఏ కిషోర్ తెలిపారు. ఈ విషయమై మండల ఎస్సై హారిక వివరణ కోరగా లింగంపల్లి పెన్నా నది సమీప ప్రాంతంలో కొంతమంది కడప నగరానికి చెందిన వ్యక్తులు చేపలు పడుతున్నట్టుగా వీఆర్ఏ ద్వారా సమాచారం వచ్చిందని లింగంపల్లి పెన్నా సమీపాన కొంతమంది ఊబిలో పడి చనిపోయారని ప్రమాదాలు అరికట్టేందుకు మా సిబ్బందిని ఆ ప్రాంతానికి వెళ్లి పెన్నా నదిలో చేపలు పట్టేవాళ్ళు ఎవరు దిగవద్దని తెలుపుతామన్నారు.

## సర్ధార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి

పటేల్ జయంతి సందర్భంగా బాలికలకు వ్యాసరచన పోటీలు



చిట్వేలి సెప్టెంబర్ 30 మనం న్యూస్: మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు సర్ధార్ వల్లబాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఎస్ఐ.వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ఐ.వినోద్ కుమార్ మాట్లాడుతూ సర్ధార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన సేవలను, ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూసించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ తులసి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో మొదటి బహుమతిని ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని ఇందు, 9వ తరగతి విద్యార్థిని పీ.నందిని లు సాధించారు. రెండవ బహుమతిని 8వ తరగతి విద్యార్థిని కే.అశ్విత, 10వ తరగతి విద్యార్థిని ఎం.తేజశ్రీ లు సాధించారు. అలాగే మూడవ బహుమతిని 8వ తరగతి విద్యార్థిని లక్ష్మి ప్రసన్న మరియు సీనియర్ ఎం.పీసి విద్యార్థిని సౌందర్య లు సాధించారు. ఎస్ఐ.వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ తులసీలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఐ వైఖరిపై భగ్గుమన్న కాంగ్రెస్:

## మోదీ, అమిత్ షా దిష్టిబొమ్మల దహనం

మనం న్యూస్ కడప సెప్టెంబర్ 30: కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి డిమాండ్ చేశారు. బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో భారీ అక్రమాలు, మ్యాచ్ ఫిక్సింగ్ జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా కూడా తమ పదవుల నుంచి వైదొలగాలని స్పష్టం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని మోదీ, అమిత్ షా, ఈసీఐ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు.

# వెంకటాద్రి ఆగనుంది!

### నందలూరుకు ఎక్స్‌ప్రెస్ హాల్ట్ మంజూరు – అక్టోబరు 3 నుంచి అమల్లోకి..

### ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా నిలుపుదల

మనం న్యూస్ రాజంపేట సెప్టెంబర్ 30 నందలూరు ప్రాంత వాసుల కల ఎట్టకేలకు సాకారమైంది. హైదరాబాద్–తిరుపతి మార్గంలో అత్యంత రద్దీగా రాకపోకలు సాగించే వెంకటాద్రి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నం. 12797/12798 కాచిగూడ – చిత్తూరు – కాచిగూడ) ఇకపై నందలూరు రైల్వే స్టేషన్‌లోనూ ఆగనుంది. గుంతకల్లు డివిజన్ పరిధిలోని ఈ స్టేషన్‌లో రైలును ఒక నిమిషం పాటు ప్రయోగాత్మకంగా నిలిపేందుకు రైల్వే శాఖ అనుమతినిచ్చింది. వచ్చే నెల (అక్టోబరు) 3వ తేదీ నుంచి ఈ హాల్ట్ అమలులోకి రానుండగా, ఆరు నెలల పాటు అందుబాటులో ఉండనుంది. స్థానికులు, నిత్య ప్రయాణికులు, ఉద్యోగుల నుంచి వచ్చిన వినతుల మేరకు రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

రైలు రాకపోకల సమయాలివీ.. (హాల్ట్: 1 నిమిషం)

కాచిగూడ – చిత్తూరు (రైలు నం. 12797): కాచిగూడ నుంచి బయలుదేరి వచ్చే ఈ రైలు తెల్లవారుజామున 04:39 గంటలకు నందలూరు స్టేషన్‌కు చేరుకుని, 04:40 గంటలకు బయలుదేరుతుంది. తిరుపతి, చిత్తూరు వైపు వెళ్లే ప్రయాణికులకు, భక్తులకు ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

చిత్తూరు – కాచిగూడ (రైలు నం. 12798): చిత్తూరు నుంచి బయలుదేరే రైలు రాత్రి 08:19 గంటలకు (20:19) నందలూరు చేరుకుని, 08:20 గంటలకు (20:20) కాచిగూడ వైపు బయలుదేరుతుంది. రాత్రిపూట హైదరాబాద్ వెళ్లాలనుకునే వారికి ఈ రైలు ఎంతో అనుకూలమైన సమయం.

**ఆదరిస్తేనే శాశ్వతం!**

ప్రస్తుతం ఈ స్టాపేజీని 6 నెలల పాటు ప్రయోగాత్మకంగా మాత్రమే కేటాయించారు. ఈ ఆరు నెలల కాలంలో నందలూరు స్టేషన్‌లో టిక్కెట్ల విక్రయాలు, ప్రయాణికుల రాకపోకలను అధికారులు నిశితంగా పరిశీలించను న్నారు. స్టేషన్‌లో ఆశించిన స్థాయిలో ప్రయాణికుల ఆదరణ, టిక్కెట్ల విక్రయాలు నమోదైతేనే ఈ హాల్ట్‌ను శాశ్వతం చేసే అంశాన్ని పరిశీలిస్తారు. కాబట్టి నందలూరు, పరిసర ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు, భక్తులు ఈ సదుపాయాన్ని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని రైల్వే వర్గాలు సూచిస్తున్నాయి.

**ఆన్‌లైన్‌లో సమాచారం..**

ఈ కొత్త హాల్ట్‌కు సంబంధించిన వివరాలను ప్రయాణి కుల కోసం ఇప్పటికే ఎన్‌టీఈఎస్, ఐసీఎంఎస్ సాఫ్ట్‌వేర్లలో నమోదు చేస్తున్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్ చేసుకునే సౌలభ్యం కలుగుతుంది. కాగా, మార్గమధ్యంలోని మిగిలిన స్టేషన్ల లో రైలు రాకపోకల వేళల్లో ఎలాంటి మార్పులూ ఉండవని రైల్వే ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. స్టేషన్ల లో మైకులు, నోటీసు బోర్డుల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని డివిజన్ అధికారులను ఆదేశించారు. నందలూరులో రైలు ఆగే అవకాశం రావడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కూటమి ప్రభుత్వ చారిత్రక సంకల్పం

## ప్రపంచ ఉద్యాన కేంద్రంగా రాయలసీమ

రూ.లక్ష కోట్ల బృహత్తర ప్రణాళికతో సీమ దశ, దిశ మార్పు

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే కూటమి లక్ష్యం: రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు

ఘనంగా రైతు అవగాహన సదస్సు.. సబ్ కలెక్టర్ భావనతో కలిసి భారీ ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభం





మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 30: రాయలసీమ ప్రాంత సమగ్ర స్వరూపాన్ని మార్చి, ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో అడుగులు వేస్తోందని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు స్పష్టం చేశారు. బుధవారం రాజంపేట పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో "ప్రపంచ ఉద్యాన కేంద్రంగా రాయలసీమ" అనే అంశంపై నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో రాజంపేట సబ్ కలెక్టర్ భావన తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతుల భారీ ట్రాక్టర్ ర్యాలీని అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

**కూటమి పాలనలోనే సీమకు స్వర్ణయుగం**

ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల దూరదృష్టితో కూటమి ప్రభుత్వం రాయలసీమ సహా 10 జిల్లాలను కలిపి రూ.లక్ష కోట్ల భారీ వ్యయంతో ప్రపంచ స్థాయి 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.10,000 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.30,000 కోట్లు కేటాయించగా, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా రూ.60,000కోట్ల పెట్టుబడులను సమీకరిస్తున్నట్లు వెల్లడించారు.




**రైతు సంక్షేమానికి పెద్దపీట**

**– రెట్టింపు ఆదాయమే ధ్యేయం**

కూటమి ప్రభుత్వ కృషితో రాజంపేట డివిజన్‌ను 3 క్లస్టర్లుగా విభజించి స్థానిక ఉద్యాన అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. అలాగే ఈ ప్రాంత రైతులకు వరప్రదాయిని అయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.788 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ నిర్ణయాలతో సాగు విస్తీర్ణం 3,453 హెక్టార్ల నుంచి 6,620 హెక్టార్లకు పెరగనుందని, అన్నదాతల వార్షిక ఆదాయం 423 కోట్ల నుంచి రూ.811 కోట్లకు రెట్టింపు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాళ్లసీమగా పేరొందిన సీమ గడ్డను ప్రపంచానికే ఆహార బుట్టగా మార్చేందుకు అక్టోబర్ 2న ప్రారంభం కానున్న ఈ మహత్తర ప్రాజెక్టుకు ప్రతి ఒక్క రైతు సంపూర్ణ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు, ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు

## నేడే ఆఖరి రోజు:ఎక్సైజ్ సిఐ టికే తులసి



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 30, మనం న్యూస్: రైల్వే కోడూరు నియోజకవర్గంలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తులు సమర్పించడానికి నేడు చివరి రోజని ఎక్సైజ్ సీఐ టి.కె. తులసి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 8 మద్యం దుకాణాల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో కోడూరు 6 దుకాణాలు,ఓబులవారిపల్లి 1 దుకాణం,చిట్వేలు 1 దుకాణం ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు. అనంతరం అక్టోబర్ 5వ తేదీన తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలను లబ్ధిదారులకు కేటాయించనున్నట్లు ఎక్సైజ్ సీఐ వివరాలను వెల్లడించారు.

# కడపలో రూ. 35 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



మనం న్యూస్ కడప సెప్టెంబర్ 30 ప్రజల రాకపోకలకు మెరుగైన వసతులు కల్పించి, కడప నగర రూపురేఖలు మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి అన్నారు. నగరంలోని 3వ డివిజన్ వైఎస్సార్ పోలీస్ కాలనీ పరిధిలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ వద్ద రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆమె శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక ప్రమాణాలతో నూతన రహదారులను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూసుకోవాలని, నిర్దేశిత గడువులోపే పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ నగర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో లేని ఉద్యాన శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

చిట్వేలీ సెప్టెంబర్ 30 మనం న్యూస్: మండలంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల ఉద్యాన శాఖ అధికారి లోకేష్ పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రైతులతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులుకి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పందికాళ్ళ మణి మాట్లాడుతూ చిట్వేలీ మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన అనేక మంది రైతులు బొప్పాయి, అరటి, మామిడి, నిమ్మతో పాటు వివిధ కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతుల ఫిర్యాదు ప్రకారం మండల ఉద్యాన శాఖ అధికారి రైతులకు అందుబాటులో ఉండకపోవడం, పంటలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం మరియు సూచనలు సకాలంలో అందించకపోవడం, రైతులు ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు స్పందించకపోవడం వల్ల అనేక




ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే మండల స్థాయిలో రైతు సదస్సులు నిర్వహించి పంటల సాగు, పురుగుమందుల వినియోగం, తెగుళ్ల నివారణ, ఉద్యాన పంటలలో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అలాంటి కార్యక్రమాలు తగిన స్థాయిలో జరగడం లేదని రైతులు ఆరోపించారు. మండలంలో పనిచేస్తున్న విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ సిబ్బందితో కూడా సమన్వయం సరిగా లేకపోవడం, రైతులు పంటలకు సంబంధించిన సమస్యలు అడిగినప్పుడు సరైన స్పందన లభించకపోవడం వంటి అంశాలను రైతులు వినతిపత్రంలో ప్రస్తావించారు. అందువల్ల రైతుల ఫిర్యాదులపై సమగ్ర విచారణ నిర్వహించి, వాస్తవాలు నిర్ధారించి, బాధ్యతారాహిత్యం రుజువైతే మండల ఉద్యాన శాఖ అధికారి బి.లోకేష్ పై శాఖాపరమైన చర్యలు, అవసరమైతే సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలని పందికాళ్ల మని డిమాండ్ చేశారు. అదేవిధంగా చిట్వేలీ మండలానికి రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే, పంటల సమస్యలపై సాంకేతిక సలహాలు అందించే ఉద్యాన శాఖ అధికారిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు ఓబిలి పెంచలయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి కటారి శంకరయ్య, రైతు సంఘం నాయకులు ఒలిమి నాగయ్య, జ్యోతి నాగేశ్వరయ్య, వేమన తిరుపయ్య, మల్లారపు గురవయ్య, రైతులు సుబ్బరాయుడు, చలపతి రాజు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 'పల్లె పండుగ-3.0'తో గ్రామీణ వికాసం

## పశుపోషణకు ఊతమిచ్చేలా షెడ్ల నిర్మాణం





ఓబులవారి పల్లి, సెప్టెంబర్ 30 ,మనం న్యూస్ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, కుడా చైర్మన్ , టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో భాగంగా ఓబులవారిపల్లి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో రెండు చోట్ల వి.బి.జి. రామ్‌జీ నిధులతో చేపడుతున్న పశువుల షెడ్ల నిర్మాణ పనులకు వారు బుధవారం భూమిపూజ నిర్వహించి, ప్రారంభించారు.

**పాల్గొన్న టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి,ఎమ్మెల్యే అరవ శ్రీధర్**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణను ప్రోత్సహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పశువులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా పాడిరైతులు, పశు పోషకులకు ఆర్థికంగా మేలు చేకూరడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని ఆకాంక్షించారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను దశలవారీగా వేగవంతంగా చేపడుతున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో జలవనరుల యాజమాన్య సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు విశేషంగా పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన చెన్నరాజుపోడు విద్యార్థినులు

**సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ నేషనల్ కప్ కైవసం**

ఓబులవారిపల్లి,సెప్టెంబర్ 30, మనం న్యూస్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడారంగంలో అద్భుత ప్రతిభను కనబరిచి తమ గ్రామానికి, పాఠశాలకు విశేష ఖ్యాతిని తీసుకువచ్చారు. చెన్నరాజుపోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారిణులు సుంకేసుల సన, సుంకేసుల మదీనా 39వ సబ్-జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ బాలికల జట్టుకు ఎంపికయ్యారు. వారు ఈ నెల 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన శిక్షణ క్యాంపులో పాల్గొని శిక్షణ పొందారు. అనంతరం ఈ నెల 26వ తేదీ నుండి మహారాష్ట్రలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో రాష్ట్ర జట్టు తరపున ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనపరిచారు.బలమైన మహారాష్ట్ర





జట్టును 6-0 పాయింట్ల తేడాతో ఏకపక్షంగా ఓడించి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఫైనల్ పోరులో కేరళ జట్టుతో హోరాహోరీగా తలపడ్డారు. చివరి నిమిషం వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో 4-3 పాయింట్ల తేడాతో కేరళపై విజయం సాధించి నేషనల్ ఛాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు. పాఠశాల స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఎదిగి, విజేతలుగా నిలిచిన సుంకేసుల సన, సుంకేసుల మదీనాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మరియు క్రీడాభిమానులు తీవ్రంగా అభినందించారు.



## క్షేత్రస్థాయి పర్యటన చేసిన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

కడప సెప్టెంబర్ 30 మనం న్యూస్ : సిద్ధవటం మండలం వానతాటిపల్లి గ్రామంలో రైతు వెంకటసుబ్బయ్య సాగు చేస్తున్న పొలాన్ని రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న పంటలు, వట్టివేరు పెంపకం, పండ్ల మొక్కలు, కూరగాయలను పరిశీలించారు. పంటల్లో కనిపిస్తున్న పురుగులను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతుకు సూచనలు అందించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా పురుగుల నివారణకు ఉపయోగించే సహజ కషాయాలు, ద్రావణాలను వినియోగించడం ద్వారా రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని వివరించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఒంటిమిట్ట మండలంలోని స్మార్ట్ కిచెన్‌ను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి. ప్రవీణ్ కుమార్ సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సి. రవీంద్రకుమార్‌తో కలిసి కిచెన్ గార్డెన్ ఏర్పాటు కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పంటల ఎంపిక, నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. పాఠశాల పరిసరాల్లో కూరగాయలు, ఆకుకూరలను సాగు చేయడం ద్వారా విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో పీఎండీస్ రైతులు, పసుపు రైతులతో కలిసి పంటల పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల నిర్వహణ, పురుగులు మరియు తెగుళ్ల నివారణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల అమలుపై రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన సమయంలో తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సహాయకులు నరసింహారెడ్డితో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటరాచపల్లి హైస్కూల్ చైర్మన్‌గా ఉమ్మడిశెట్టి శివ, వైస్ చైర్మన్‌గా బచ్చు కోటేశ్వరమ్మ ఏకగ్రీవం




చిట్వేలీ సెప్టెంబర్ 30 మనం న్యూస్: మండలం వ్యాప్తంగా 61 పాఠశాలల్లో, 55 ప్రాథమిక పాఠశాలలు, ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జరిగిన ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి1 ఖాజా మొహిద్దిన్, 2. ఈశ్వరయ్య లు పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటరాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ గా ఉమ్మడిశెట్టి శివ, వైస్ చైర్మన్ గా బచ్చు కోటేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఉమ్మడిశెట్టి శివను మరియు వైస్ చైర్మన్ కోటేశ్వరమ్మను ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, తెలుగుదేశం నాయకులు మండల ఉపాధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు రైల్వేకోడూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ బచ్చు రామచంద్ర, చలపతి, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఉమ్మడిశెట్టి శివ మాట్లాడుతూ ఈ బాధ్యతలను పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యాభివృద్ధికి, సహకరిస్తానని, ఈ అవకాశం రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేతివారిపల్లి పాఠశాల చైర్మన్‌గా కొండూరు హరి, వైస్ చైర్మన్ తుమ్మల వర్ధన ఏకగ్రీవం

చిట్వేలి సెప్టెంబర్ 30 మనం న్యూస్: మండల వ్యాప్తంగా ఉండే పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పరిధిలోని నేతివారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికల నిర్వహించగా చైర్మన్ గా కొండూరు హరి, వైస్ చైర్మన్ గా తుమ్మల వర్ధన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముందుగా పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్ లను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ కొండూరు హరి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో చైర్మన్ పదవికి మద్దతు తెలిపిన పిల్లల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు నా వంతు సహాయ సహకారాలు చేస్తూ, పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొట్టిమానుకోన నీటి సంఘం అధ్యక్షులు బుర్రు సుబ్రహ్మణ్యం యాదవ్, నాగయ్య యాదవ్, పలువురు పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

